
ఆకాశ
దీపం
జయంతి
వెంకటరమణ

కదులుతున్న కారు ఆగిపోయింది.

రాధ పెళ్ళి గురించి నాలో సాగుతున్న ఆలోచనలూ తాత్కాలికంగా ఆగిపోయాయి. కారు ఆగటానికి కారణం నాకు తెలియదు. నేను తల ఎత్తి డ్రైవర్ వీర్రాజువైపు చూచేసరికి, అతను కారు దిగి నే కూర్చున్న వైపున 'విండో' దగ్గరికి వచ్చి తలవంచి "అల్లదే మా వూరు బాబూ!" అన్నాడు సవినయంగా; ఆ సాయం సమయంలో దారి ప్రక్కన వింతగా మెరిసే చేలకు దూరంగా కనిపించీ కనిపించకవుండే ఒక పల్లెను చూపుతూ. రాధ ఆలోచనలతో సతమతమయిపోతున్న నేను అతను కారాపి ఊరును పరిచయం చేయటంలోని ఆంతర్యాన్ని కనిపెట్ట ప్రయత్నించక "అలాగా!" అని అన్నాను. నేనతనిని ఇంకా ఏదో అడగాలన్నదే అతని తాపత్రయం. అతని చూపులు గ్రహించి "అయితే ఏమంటావు ?" అన్నాను అసహనంతో.

వీర్రాజు నా గొంతులోని కరుకుదనాన్ని గమనించినా, "అల్లదే మా ఊరు బాబూ! ఆ ఊరికి నే వెళ్ళక మూడు సంవత్సరాలకు పైగా అయిపోయింది. అక్కడ మా అమ్మ ఉంది. ముసలిది బాబూ! ఒక్కసారి చూచి వచ్చేస్తాను. ఇది తప్పితే మరి నాకు అవకాశమే రాదు. మా అమ్మకోసమే ఈ పళ్ళు, బట్టలు కొన్నాను. ఈ నలభై రూపాయలు చేతిలో పెట్టి వచ్చేస్తాను బాబూ! ఒక్కసారి" జేబులోంచి పర్సు తీస్తూ అన్నాడు.

వెళ్ళిన పనిలో ఆశాభంగం ఎదురవగా, మనసు చీకాకుగా ఉన్న పరిస్థితిలో వీర్రాజు చేసిన విన్నపము ఇది. అతని మాటలు నాలో కుతూహలాన్ని రేపగా అన్నాను. "అయితే ఇంతకాలం ఆమెను చూడకుండ ఉండగలిగావా వీర్రాజూ?" అని. వీర్రాజు తల దించుకొని "ఏంచేయమంటారు బాబూ! మా ఆడది ఒక రాక్షసి నన్ను వెయ్యికళ్ళతో కనిపెడుతూ ఉంటుంది. ఎప్పుడు కేంపుమీద వెళ్ళినా నేను ఇక్కడికే వచ్చానని దాని అనుమానం. ఒక్కొక్కప్పుడు దానిని చంపి పోగులు పెట్టి నన్నూ చంపుకోవాలనిపిస్తుంది. కాని ఏంచేయను ? నాకు నలుగురు పిల్లలు. అందుకని అది బ్రతికిపోయింది. ఇదే నాకు అవకాశం. ఇది దాటితే నేనిటు రావటం అవదు. ఆ కనిపించే కొబ్బరితోటకు ఆనుకున్నదే మా ఊరు. కాని అంతవరకూ కారు వెళ్ళదు. దారిలో వాగు ఉంది. వాగు దాటి రెండు ఫర్లాంగుల దూరంలో మా వూరు. వాగు ముందు ఒక ఊరుంది. అంతవరకూ తీసికెడతాను. మా అమ్మను చూచి గంటలో వచ్చేస్తాను. ఆ తరువాత మీ ఇష్టం. ఎంత దూరమైనా ఎన్ని గంటలయినా డ్రైవ్ చేస్తాను" అన్నాడు.

నా గుండె చెమ్మగిల్లింది. నెమ్మదిగా వీర్రాజు భుజంమీద చెయ్యివేసి "వీర్రాజూ! మీ అమ్మను ఒక గంటసేపు చూడటంతో నీవు తృప్తిపడగలవేమో! కాని నిన్ను అంత తొందరగా వదలుకోటానికి ఆమె యిష్టపడదు. నాకు తెలుసు. ఒకరోజు కాదు. రెండురోజులు సెలవు తీసుకో. నిన్ను నా స్వంత పనిమీద పంపానని మీ యింటికి కబురెడతాను. నేను వెళ్తాను" అన్నాను.

వీర్రాజు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి" అన్ని రోజులు వద్దులెండి బాబుగారూ. మీరున్నారు కాబట్టి ఈ ఒక్కరాత్రి అవకాశం యివ్వండి. రేపు వుదయం కలసి వెళ్ళిపోదాం. కాని ఈ రాత్రి మీకు ఇబ్బందిగా ఉంటుంది. మిమ్మల్ని మా వూరే, మా యింటికే తీసుకెడుదును. కాని వాగు దాటి మీరు నడువలేరు. వాగు ముందు ఒక వూరుందని చెప్పానుగా. ఆ వూరిలో ఒక గుడి ఉంది. గుడిలో పూజారి ఉన్నాడు. అతను బ్రతికే ఉండి ఉండాలి. ముసలివాడు. అతను ఉంటే మీకు ఏ అసౌకర్యము ఉండదు. అతను లేకపోయినా మీ రీ రాత్రి గడపటానికి ఏర్పాటు చెయ్యగలను. ఏమంటారు ? రేపు ఉదయం ఇద్దరం కలిసే వెళ్ళిపోదాం." ఏనాడూ అతిగా మాటాడని వీర్రాజు నాతో అన్నాడు.

పల్లెటూళ్ళతో నాకు పరిచయం చాల తక్కువ. కథల్లో చదివి, సినీమాల్లో చూచిన పల్లెలమీద మాత్రం గౌరవం ఉంది. అదోరకమైన మోజు ఉంది. ఎంతసేపూ ఫ్యాక్టరీ వాసనల మధ్య, ఫానుల క్రింద, ఫోనుల ప్రక్క, మేడల్లోనూ, ఎయిర్‌కండిషన్డు గదుల్లోను గడిపిన నేను అనుకోకుండా ఎదురవుతున్న అనుభవాల్ని కాదనదలచుకోలేదు. సరే అన్నాను. వీర్రాజు సంతోషంతో కారును మట్టిరోడ్డువైపు పోనిచ్చాడు. రోడ్డు కిరువైపులా అలతి దూరంలో చెలకుతోటలున్నాయి. ఒకవైపుగా వరిచేలు ఏపుగా పెరిగి వయసువచ్చిన ఆడపిల్లలా తలవంచుకుని సిగ్గుపడుతూ, అదేదో పాటను వినిపించీ వినిపించనంత మెల్లగా పాడుకుంటున్నాయి చలిగాలిలో· గాలికి ఎగిరిపోతున్న పయ్యెదను బొడ్లో దోపుకుంటున్నట్టు ఒక్కొక్కసారి దగ్గరగా వస్తున్నాయి వరి కంకులు. అదే సమయంలో ఏదో గుసగుసలాడుకుంటున్న సవ్వడి వినిపించకపోలేదు. మా కారు వూరు మొదలులోకి ప్రవేశించింది. ఊరుముందు విశాలమైన చెరువుంది. ఆ చెరువు నానుకునే ఊరు ఉంది. చెరువుగట్టున రావి చెట్టుంది. రావి చెట్టుక్రింద బొజ్జలినాయకుడు తూర్పుదిక్కుగా ముఖం పెట్టుకని ఊరివైపు వామహస్తాన్ని అభయమిస్తున్న రీతి అభినయిస్తూ కూర్చుని ఉన్నాడు. మా కారు మరి కాస్త ముందుకు సాగి ఉన్నతంగా ఆకాశంవైపు ఎదిగి నిల్చున్న

దేవాలయం ముందాగింది. నేను కారు లోంచి ఊగను చూశాను. దీర్ఘాలోచనలో కూర్చున్న పెద్దమనుషుల మాదిరి తలలు వంచుకున్నాయి ఊరిలో పుంఖ్కు. నెరసిన వెంట్రుకలు గాలిలో రెపరెప లాడుతున్నాయి. గుడి కెదురుగా కుడి ఎడమల రెండు వీధులు బారులు తీర్చి వున్నాయి. నేను ఊరిని పరిశీ లిస్తూండగా వీర్రాజు కారు దిగాడు. ఆడుకునే పిల్లలు కుతూహలంతో మా కారు చుట్టూ చేరారు నేను కోవెలవైపు దృష్టి మరల్చుకున్నాను. పడిపోతున్న ప్రహరీ గోడలు, తలుపులులేని ముఖ ద్వారం, ఏ తుఫానుకో కూలిపోయిన ధ్వజస్తంభం, ఎత్తైన కోవెల గోపురం, మొదటిచూపులోనే నాకు గోచరమైనాయి. పావురాలు గూళ్ళకు చేరినవి కాబోలు. దేవుడికి వింజామరాలు వీచుతూ ఏదో మొరపెట్టుకుంటున్నాయి.

వీర్రాజు డోర్ తెరుస్తూ "రండి బాబూ! నేను పూజారిగారితో మాటా డాను. తాతగారు మిమ్మల్ని తీసుకు రమ్మన్నారు. చెప్పానుగా, తాతగారు చాలా మంచివారు. రండి" అన్నాడు. నేను కారు దిగి రెండడుగులు ముందుకు వేసి ప్రక్కకు చూశాను. ముఖద్వారం నుండి గుడికి వెళ్ళే దారిలో నున్న మెట్లలో, పై మెట్టు మీద ఊర్ధ్వ పుంజ ములతో నావైపే చూస్తున్న ఆరడుగులు ఎత్తు గలిగి వంగుతున్న నడుమును నిలబెట్టుకునే ప్రయత్నంచేస్తున్న వృద్ధుని చూశాను. అప్రయత్నంగా రెండు చేతులు జోడించి నమస్కరించాను. అతను చిరునవ్వుతో నన్ను ఆశీర్వదిం చాడు వీర్రాజు నా సామాను పట్టుకుని నా ముందుగా నడిచాడు. పూజారి మాకు ఎదురొచ్చి "రండి బాబూ!" అంటూ ఆలయ ప్రాంగణంలోనే ఒక మూల ఉన్న చిన్న పెంకుటింటివైపు తీసుకెళ్ళాడు "ఆలయంలో కెళ్ళి దేవుణ్ణి చూచి వద్దాం" అన్నాను వీర్రాజుతో. "అలాగే రండి బాబూ!" అన్నాడు పూజారి. ఆలయప్రాంగణంలో నున్న బావిలోంచి నీరు తోడి ఇచ్చాడు వీర్రాజు. చేతులు, ముఖం, కాళ్ళు కడుగుకొని ఆలయంలోపలికి ప్రవేశించాము. మా కన్న ముందుగా గర్భగుడిలోకి చేరిన తాతగారు చీకటిలో తడుముకుంటూ నూనె దీపం వెలిగించారు ఆ సాయం కాలపు వేళ గుడిలో, చీకటిలో నల్లరాతి విగ్రహాలముందు వెలుగుతున్న ఆ చిన్న దీపం చిందే వెలుగులో కళ్ళు చించుకుని చూశాను. కోదండరాముడు, సీతాదేవి, లక్ష్మణమూర్తి విగ్రహాలు, చిరిగిన పాతబట్టలు ధరించి దీనాతిదీనంగా నిలబడి ఉన్నారు వారి మెడల్లో బంతి పూదండలు వ్రేలాడుతున్నాయి. చీకటిని చీల్చుతూ హారతి వెలిగించాడు పూజారి. ఆ వెలుగులో ఆ మూర్తులను చూచి దిగ్భ్రాంతి చెందాను. ఇది ఈనాటి

శిల్పం కాదు. కొన్ని వందల సంవత్సరాలనాటిది. కంచిలో ఈ శిల్ప నిర్మాణం చూశాను. కనులు, ముక్కు, ఆ విషయాల్ని స్పష్టం చేస్తున్నాయి. దేవాలయాన్ని, మూర్తులను చూస్తూండే మొదటినుండీ, దేవాలయం యిదే స్థితిలో ఉందని నమ్మకం కలుగలేదు. ఏదో కోణంనుండి పూర్వపు ఔన్నత్యం ఉట్టి పడుతూనే ఉంది.

పూజారి వణికే చేతులతో తీర్థం మా ఇరువురికి యిచ్చి, తులసిదళాలను మా చేతులలో ఉంచుతూ, ఈ ఆలయం ఈనాటిదికాదు బాబూ!... మా తాతల నాటిదినా ముప్పయి అయిదేళ్ళ ప్రాయం వరకూ నాకు తెలుసు...నా దేవుడు ఇప్పటిలా...ఇలా బీదగా ఉండేవాడు కాదు...ఎంతటి వైభవం ? ... ఎన్ని ఆభరణాలు !!...ఎన్ని వాహనాలూ!!! అన్నీ పోయినయి.దేవాలయం వివాదంలో పడింది...చూచే నాథుడు లేడు... గోడలు కూలినై...వంటశాలలు మంటిని కలిసినై ఈ దేవాలయానికి ఆస్థి లేదు... ఉన్నదంతా వరుల హస్తగతమైంది... ఈ దేవాలయం ఇప్పుడెవరికీ అక్కర లేదు. ఆస్థి లేదుకదా! రాబడి లేదు. అందు నే ప్రభుత్వానికి అక్కరలే దీ కోవెల..." వణికే గొంతుతో తన ఆవేద వెలిబుచ్చాడు పూజారి. "ఇది కార్తీకమాసం కనుక, ప్రక్క ఊరిలో ఉన్న శివాలయానికి వెళ్తూ జనం కోవెల లోకి ఒకసారి తొంగిచూస్తారు కనుక ఈ వేళప్పుడైనా ఈ దేవాలయం తెరిచి ఉంది. లేకపోతే మూసి ఉండాల్సిందే. కాని నే నలా ఉంచను...పాతరోజులు గుర్తు తెచ్చుకుంటూ ఇక్కడే ఇలా కూర్చుంటా. రండి బాబూ కోవెల ఆవరణ చూదురుగాని" అన్నాడు

నైవేద్యం పెట్టిన అరటిపళ్ళను మా కందించి. నేను అతనిని అనుసరించ బోతూ వీర్రాజువైపు చూశాను. వీర్రాజు మనసు అక్కడ లేదని గ్రహించాను. వీర్రాజుని వెళ్ళమని చెప్పాను. వీర్రాజు పదే పదే నమస్కరిస్తూ నా నుండి సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. పూజారి వెనుక ప్రదక్షణం చేస్తూ కోవెలను పరిశీలించాను! ఉన్నతమైన కోవెల గోపురం. పూర్తి వైష్ణవ సాంప్రదాయం. కోవెల వెనుక గోడమీద నృశింహావతారంలో ఉన్న శిల్పం తప్ప దేవాలయం గోడలపై ఎట్టి శిల్పసంపద కానరాలేదు అంతేగాక అంతటా సిమెంటుపూత పూసిన చిహ్నాలు కూడి నాకు గోచరమైనాయి. ఆ సిమెంటు వెనుక ఎంత శిల్పసంపద అయినా ఉండవచ్చు. అది బయల్పడే సరికి కొన్ని దశబ్దాలయినా అవవచ్చు. పూజారి చెప్పసాగాడు. "అది ధాన్యాగారం...దక్షిణంగా ఉన్న అవి వంట శాలలు...ఉత్తరంగా కనిపించే ఆ మట్టి దిబ్బ ఒకప్పుడు స్వామివారి ఆభరణాల గది. ఆ ప్రక్కనే వాహనాల శాలలు...

దాన్ని చూశారుగా...అక్కడ ధ్వజ స్తంభం ఉండేది. కాని ఇప్పుడు లేదు... ఎందుకూ అంటే అది అంతే...స్వామి వారి కెదురుగా స్తంభాలు పడిపోయిన ఆ ఎత్తైన ప్రదేశం చూశారుగా...అది కళ్యాణమంటపం...,ఆ వేదికపై ఎందరి వివాహాలో జరిగాయి. నా వివాహం కూడా అక్కడే జరిగింది. మా పెద్దమ్మాయి పెళ్ళి కూడా అక్కడే జరిగింది.అది చచ్చిపోయిన సంవత్సరమే గాలివాన వచ్చింది. ధ్వజస్తంభం విరిగి పడింది కళ్యాణమంటపం ధ్వంసం అయింది. అయినా ఆ దిబ్బ మీదే రెండో అమ్మాయి పెళ్ళి జరిపించాను. అది అత్తింటికెళ్ళి రెండుసార్లే వచ్చింది. అత్తవారు దానిని పంపరు. నాకు ఒకడే కొడుకు. వాసి వాడున్నా లేనట్టే. వాడు దేశాలు పట్టిపోయాడు. నా తరువాత నా తరఫున స్వామివారి ముందు దీపం వెలిగించేవా రెవరూ లేరు. అయితే నాతోనే నా లోకం. నే తనువు చాలించిన తరువాతనైనా నా స్వామికి మంచిరోజులు రాకూడదూ!...''

చీకటి పడమటి దిక్కుకు ఒదిగి దాక్కొనే ప్రయత్నంచేస్తూంటే పున్నమి చంద్రుడుదయించాడు. చలిగాలులు వీచసాగాయి. మాటిమాటికి ఆలయం సమీపాన ఉన్న పొన్నచెట్టునుండి పొన్న పూవాసనలు రాసాగాయి. పూజారి తన ఇంటివైపు నన్ను తీసు కెళ్ళాడు. ద్వారానికి ముందుగా కుడి ఎడమల విశాలమైన రెండు మట్టి అరుగులున్నాయి. ఒక అరుగుమీద నులకమంచం ఉంది. పూజారి రెండో అరుగుమీద కూర్చుంటూ నాకు మంచం చూపించాడు. నేను మంచంమీద కూర్చున్నాను. అతను హరికెన్ లాంతరు వెలిగించి ఒక ప్రక్కగా ఉంచాడు.

“ఊరు చూడబోతే బాగా చిన్నది. సమీపాన ఊర్లేవీ ఉన్నట్టు కనిపించవు. మరి మీ జీవనాధారం [illegible].

అతను నవ్వాడు బోసినవ్వు. ఆ నవ్వులో ఏదో ధైర్యం ఒకరకమైన తృప్తి కనులు చిన్నవైనాయి. “స్వామి రాముడుండగా నాకు లోటేమిటి బాబూ! ఈ ఊరిలో ఒక్కో [illegible]... నెలకో, రెణ్ణెల్లకో, [illegible]డో, [illegible]డో కుంచాల చొప్పున బియ్యం [illegible]. రాత్రి నేను భోజనం చేయను. వృద్ధాప్యం కదా. అవి నాకు సరిపోతాయి. కూరా, నారకీ, ఈ మూలనో, ఆ మూలనో, బీర, బెండ, పొట్ల [illegible] వేస్తా. నా హస్తవాసి మంచిది. గంపలుగా కాస్తాయి కూరలు. అన్నీ నేనేం చేసు కుంటా ? ఊరందరం పంచుకుంటాం. ఆ మొక్కలను సంరక్షించే బాధ్యత పూర్తిగా మా మనుమరాలిదే. ఆమే ఈ దేవాలయంలో ఉదయం, సాయంత్రం దీపం పెట్టటానికి నూనె,

ఒత్తులు తెచ్చి పెడుతుంది. వీలయినప్పుడల్లా తన పెరటిలో పూచిన పూలు మాలలా కట్టి తెచ్చిస్తుంది. ఇక నాకేమి తక్కువ నా రాముడుండగా?"

అంతలో కోవెలలో కాంశ్య గంట మ్రోగింది.

"ఎవరో వచ్చారు ?" అన్నాను. "ఇంకెవరొస్తారు ?" అంటూ లేచి వెళ్లాడతను. అతను వెళ్తుంటే నా దృష్టి కళ్యాణవేదిక పై పడింది వెంటనే నా పెళ్ళి దృశ్యం నా కనులముందు కదిలింది. అది పెళ్ళికాదు ఒక అర్భాటం... ఒక నాటకం...అయినా నేను మరచిపోలేను...ఇంకా...ఇంకా...ఆ కళ్ళు... ఆ కన్నీళ్ళు...ఆ వాద వివాదాలు... ఏమిటో ... గుర్తుకు తెచ్చుకోకూడదు గాని...అన్నీ గుర్తే...ఆ గుడి...ఆ కళ్యాణవేదిక ... ఆ రాత్రి ... గుర్తే. కాని గుర్తుకు తెచ్చుకోకూడదు. గుర్తుకు తెచ్చుకున్నందువల్ల ప్రయోజనంలేదు. గతించినదేదో గతించింది...గతించినది మరపుకు వస్తే బాగానే ఉండును...కాని మరపురాదు...రాధ పెళ్ళి గుర్తుకొచ్చినప్పుడల్లా ... ఆ రాత్రి ... గుర్తుకు వస్తూనే వుంది. బహుశా..."

"వస్తాను తాతగారూ" అనే గొంతుతో నా ఆలోచనలు తెగాయి. ఆ కంఠం వినవచ్చినవైపు చూశాను. లేత వెన్నెల్లో ఒక తెల్లచీర నడచిపోతోంది. ఊహించాను, గుడిలో దీపం వెలగటానికి కారకురాలు ఈమే అయ్యుంటుందని. తాతగారు వస్తూ సన్నగా నవ్వుతూ "చూశావా బాబూ! ఈ రోజు వచ్చిన అతిథిని సత్కరించి పంపటమెలా అని ఆలోచిస్తూంటే నా రామచంద్రుడే దారి చూపాడు. ఇందాక అనలే మా మనుమరాలని - ఆమే ఈమె. ఇప్పుడు వచ్చింది పిలిచినట్టుగా. ఈ రోజు కార్తీక సోమవారం. ఆమెకు ఉపవాస దినం. వీర్రాజు గురించి, మీ గురించీ చెప్పాను. ఈ ఉపవాస దినాన్న ఒక అతిథికి భోజనం పెట్టటంకన్నా ఆనందదాయకం మరేదీ లేదు. ఈ రోజు రాత్రి ఏ కాయో పండో తిని ఉండనవసరంలేదు. అక్కడ భోజనంచేసి వస్తే రాత్రి ఎలాగయినా ఇక్కడ గడచిపోతుంది. ఏం బాబూ! సమ్మతమే కదూ" అన్నారు ఆహ్వానాన్ని నిరాకరించటం నా చేతకాలేదు తాతగారు తృప్తిగా నవ్వి గోడకు చేరగిలబడ్డారు.

"వీర్రాజు నా డ్రైవరు. అతను నాకెంతో సమీపంలో ఉన్నా, అతని భార్య గయ్యాళితనం గురించి గాని, ఏ ఆధారమూ లేని అతని తల్లిగురించిగాని తెలుసుకోలేకపోయాను. ఈ దారినే నేనొక్కడినే నాలుగైదుసార్లు ప్రయాణం చేశాను. కాని ఇంత పురాతనమైన దేవాలయం ఈ మారుమూల ఉన్నదన్న విషయాన్ని తెలిసుకోలేకపోయాను. ఈ రోజెందుకో వింతగా వుంది. అన్ని

రోజుల్లా కాదు. నా గురించి నే నాలో చించలేకపోతున్నాను" అన్నాను. నా మాటలనుండి దేనినో గ్రహించినట్లు భావయుక్తంగా నవ్వారు తాతగారు.

వెన్నెల చిక్కపడింది, పొన్నచెట్టు నుండి తీయని వాసనలు సన్నగా రాసాగాయి. గోపురంలో గూళ్ళు కట్టు కున్న పావురాలు తీరికగా మాటా మంతీ సాగిస్తున్నాయి; జంటలై. గాలి వీచి నప్పుడల్లా సన్నగా చలివేయసాగింది. ఊరింకా నిద్రపోలేదు. ఏదో మూల నుండి ఏదో సవ్వడి వినవస్తూనే వుంది. తాతగారు హరికెన్ లాంతరును మా మధ్య ఉంచుతూ, "బాబూ! మీ రెందరు పిల్లలు ? ఏ ఊరు మీది ? ఏం పనిమీద యిటు వచ్చారు ?" అని అడిగారు.

ఫ్యాక్టరీ అసిస్టెంటు మేనేజరుగా ఉంటూ, ఎయిర్‌కండిషన్డు గదులలో ఫోను ప్రక్క, ఫానుల క్రింద, డన్‌లప్ పరుపులమీద బాధ్యతకలిగిన వ్యక్తిగా, పరపతి గలిగిన మనిషిగా చెలామణి అవుతున్న నన్ను పిలిచి 'నీలో నున్న నీవు ఎవరు' అని అడిగేపాటి సాహసం ఎవరికీ లేకపోయింది. అవకాశమున్నా అడిగేపాటి ధైర్యం ఎవరికుంది ? కాని ఎవరైనా నన్ను లాలించి అడిగితే నాలోని బాధను తనివితీరా చెప్పుకుని బరువు దింపుకోవాలని ఎంతో ఉంది. కాని ఎవరికి చెప్పాలి ? ఎలా చెప్పుకో వాలి ? చెప్పినా సానుభూతి చూపే దెవరు ? కాని తాతగారలా నన్ను అడుగుతూంటే నా గురించి అంతా చెప్పేసుకోవాలనిపించింది. ఎలా ప్రారం భించను ? "ఏం బాబూ! మిన్నకుండి పోయారు ?" తాతగారడిగారు.

"చెప్తాను తాతగారూ! అంతా చెప్తాను. నా కారు, నా హోదా ప్రక్క నుంచి నన్ను మనిషిగా చూచి చెప్పండి తాతగారూ! నా జీవితంలో కలిగిన బాధలు, ఆశాభంగాలు అన్నీ చెప్తాను. కాని ముందుగా నా దొక సమస్య. ఈ సమస్యకు పరిష్కారమార్గం చెప్పండి తాతగారూ !" అన్నాను.

"చెప్పండిబాబూ!"అన్నారు మాసిన గడ్డాన్ని ఎడమచేత్తో దుద్దుకుంటూ.

"నాకు ఇద్దరు కూతుళ్ళు తాతగారూ! పెద్దమ్మాయి రాధ, పెళ్ళీడుకు వచ్చింది. రాధ అందంగా ఆరోగ్యంగా ఉంటుంది. అందుచేత ఎవరైనా రాధను పెళ్ళాడ టానికే యిష్టపడుతున్నారు. కాని రాధను కోడల్నిగా చేసుకోవాలని వచ్చే వాళ్ళు మాత్రం నా ఆస్తిని, అంతస్థునే చూచి రాధను యిష్టపడుతున్నారు. అంతేగాని వివాహమనేది పవిత్రమైన కార్యమనే భావన వారిలో నాకు కనిపించటంలేదు. ఇరవైరోజుల క్రితం రాధకు ఒక సంబంధం వచ్చింది. ఇరవై వేలు కట్నం యివ్వటానికి, అంతే ఎత్తున లాంఛనాలు యిచ్చి, పెళ్ళి జరిపించ టానికి నిర్ణయం జరిగింది. కాని రెండు

రోజుల క్రితం, యింకో పదివేలిస్తేనేగాని సంబంధం నిలిచేటట్టు లేదని వార్త. సంబంధం వదలుకోవటం యిష్టంలేక ఆ సొమ్ము యిద్దామని వెళ్ళాను. కాని వాళ్ళ గొంతెమ్మ కోరికలు వింటూంటే విసుగు, అసహ్యం, కలిగాయి. ఏం చేయాలో తోచక తిరిగి వచ్చేస్తున్నాను. వారు కోరిన కోర్కెలను తీర్చలేని అసమర్థుడను కాను నేను. కానీ ఈ దాహానికి అంతు అనేది ఉన్నదా? లేదా? అనే నా బాధ. వీరి దాహాన్ని తీర్చట మేనా లేక ఈ సంబంధాన్ని వదులుకో మంటారా ? దయచేసి చెప్పండి" అన్నాను

తాతగారు సన్నగా నవ్వారు. తరవాత అన్నారు. "మీ దగ్గర ధన మున్నదని తెలిసిన తరువాత అందరూ సహజంగా యిలానే ప్రవర్తిస్తారు. ఇంతదూరం వచ్చినతరువాత వెనకకు పోవటమెందుకు? శుభస్యశీఘ్రం" అని "కానిచ్చేయండి. అమ్మాయి యిష్టపడితే వెనకకు పోవటమెందుకు? ఇంతకూ అమ్మాయి ఇష్టపడింది కదా !"

తాతగారి ప్రశ్న నాలో కలత రేపింది. కొద్దిసేపు మాటాడలేక పోయాను.

"ఏమీ మాటాడరేం ? అమ్మాయి ఏమంటున్నది ?"

"పిల్లలకి యిష్టాలుంటాయి. వాటిని మన్నించటం కూడా మన ధర్మం. కాని కోరిన కోరిక సరియైనది కానప్పుడు ఎలా మన్నించగలం ? నా కోరికను కాదని నన్ను నిరాశపరచిన మా పెద్దల లాంటివాడనుకాను నేను. కాని రాధ కోరిక మాత్రం సుతరామూ నచ్చటం లేదు."

"ఇంతకీ అమ్మడు ఏమంటున్నది ?"

"ఏమంటుంది? ఆస్తి, అంతస్థూ ఏమీ లేని ఒక సామాన్యుని యిష్టపడుతోంది. చదువు అంటే ఉండవచ్చుకాని మూడు వందల రూపాయలు దాటని ఉద్యోగం అతనిది. అతనికి మరి ఏ యితర ఆధారమూ లేదు. అందగాడు కాదు. అలా అని అనాకారీ కాదు. 'అతను మంచివారు నాన్నా!' అని అంటుంది రాధ. అతను మంచివాడే కావచ్చు. కాని మేడల్లోనూ, కార్లలోనూ తిరిగిన నా రాధను ఆ బీద యింటికి ఎలా పంపను ? నా కూతురు సుఖపడాలని, కార్లలో తిరగాలని నాకుండదూ ? మరి నా మాటలు రాధ ఎందుకు అర్థంచేసుకోదు?"

"అయితే అమ్మడు యిష్టపడని పెళ్ళా ?"

"ఆ...మరి...మరి ... యిష్టపడని పెళ్ళని కాదు. కాని...కాని...నా బాధ రాధ కేంతెలుస్తుంది ? 'నీ కిష్టమే కదమ్మా' అని అడిగితే 'నీ యిష్టం నాన్నా!' అని అంది. అది చాలదూ ?"

"చాలకేం ? బాగానే సరిపోతుంది

అందుకనే ఈ వేళంపాటలో మీదే పైచెయ్యి అనిపించుకుందామనుకుంటున్నారా ?" భ్రుకుటి ముడిచి తల ఎగరేస్తూ

అతని మాటలలో హేళన నాకు అర్థమైంది.

"ఎగతాళి చేస్తున్నారా?" అడిగాను.

"ఎగతాళి కాదు. ఉన్నమాట అన్నాను. అబ్బాయి మీకూ అమ్మాయికీ నచ్చితే ఆ యిచ్చే కట్నమేదో అమ్మడు యిష్టపడిన అతనికే యిచ్చి అమ్మాయినిచ్చి పెళ్ళిచేస్తే అమ్మాయి సుఖపడదా? ఉన్నవాడు లేనివాడివైపు చూడకపోతే అంతస్థులు అనే అడ్డుగోడలు పడిపోవటం ఎప్పటికి సాధ్యం ? ఆలోచించండి" అన్నారు తాతగారు. నేనేదో చెప్పేలోగా ఆయనే అన్నారు, "మీ యవ్వనంలో మీ కోరిక ఎంత సవ్యమైనదని మీరు నమ్మారో అమ్మడు కోరిక కూడా అంత సవ్యమైనదని ఎందుకు నమ్మరు ? మీరు ఏ కోరికను తీర్చుకోలేకపోయారో నాకు తెలియదు. అది సహేతుకమవునో కాదో నాకు తెలియదు. కాని అమ్మాయి కోరికలో ఖండించదగినదేదీ లేదు. ఒక ధనవంతుని కూతురు, ఒక గొప్పింటి పిల్ల ఒక బీద యువకుని ఇష్టపడుతోంది. దీనికెంత హృదయ వైశాల్యం కావాలి?"

"అంటే...అంటే..."

"నా అభిప్రాయాన్నే చెప్పాను. మిమ్మల్ని అలా చెయ్యమని నా ఉద్దేశ్య కాదు. ఈ రాత్రి గడిస్తే మీరెవరో, ‹ నెవరినో. కాని చివరిగా ఒక్కమా‹ చెప్తాను వినండి. ఏ కట్నాలనే వేల పాటలో మీలాంటి డబ్బున్నవా‹ ప్రాణంలేని అమ్ముడు వస్తువుల‹ పోతున్నారో, ఆ వేలంపాటలో నిల‹ తన స్వంతం చేసుకోలేని ఒక అమ్మా‹ పెళ్ళి ఈ కారణంచేతనే పీటలమీద‹ ఆగిపోయింది. అబ్బాయి, అమ్మాయి ఒకరి నొకరు ఎంత యిష్టపడినప్పటి‹ కట్నమనేది వారిని వేరుచేసింది అంతస్థులు అనే పేరుతో అమ్మడ మాటను మీరు మన్నించకుండ ఉన్నారు ఈ విషయంలో నే చెప్పగలిగేది యిం‹ కన్నా ఏముంటుంది ?"

"అయితే రాధ మాటనే కానివ్వ‹ మంటారా ?" ఆలోచనలో పడుతూ అడిగాను.

"అది మీ యిష్టం. ఏ నిర్ణయం‹ చేసినా ఆ అభాగ్యురాలి పెళ్ళిలా మాత్రం పీటలమీద ఆగిపోయే దుస్థితిని మాత్రం తెచ్చిపెట్టుకోకండి. అంతే." తాతగారి గొంతు బొంగురు పోయింది.

"అలాగే! ఇంతకీ ఎవరా అభాగ్య రాలు ?"

"తాతగారండీ!...మరే...మరే... వంటయిపోయింది...మరి ... మరే... రమ్మన్నారండి''వీధిలోంచి పరుగెత్తుకుని

వస్తూ అయిదేళ్ళ పాప తెచ్చిన వార్త.

"ఆ! ఆ!! అలాగే వస్తున్నామని చెప్పమ్మా! పదండి బాబూ! అమ్మాయి కబురు పెట్టింది'' అంటూ లేచారాయన.

"ఇప్పుడేగా ఆమె వెళ్ళారు. అప్పుడే వంటయిపోయి ఉంటుందా?" అడిగాను.

"ఆడవారి సంగతి మనలా కాదు. 'కాళ్ళు కడుక్కోండి పచ్చడి రుబ్బేస్తా. పీట వాల్చుకోండి ముక్కాలు వేయిం చేస్తా' అంటారు. అది అతిశయోక్తి అనుకోండి. కాని మా మనుమరాలు సంగతి అలా కాదు. ఎంత పెద్ద వంటయినా చిటికెలో చేసిపడేస్తుంది. అలసిపోదు. ఎంత పనినైనా చేసిపడేస్తుంది. ఆయాసపడదు. కట్టిన చీర నలగదు. సిగలో పూలు వాడిపోవు" అన్నాడతను.

"అవును. కొందరికి అది వరం."

"అదీ నిజమే! ఇలాంటి వరాలిస్తాడు కాబట్టే దేవుడు కొన్ని శాపాలు కూడా యిస్తాడు."

"అంటే ?" ఏదో సంశయం మనసులో మెదలగానే అడిగాను.


"మడి కట్టుకోండి. తరువాత మాటాడుకుందాం!"

కోవెలకు చాల సమీపంలోనే ఉంది ఆమె ఇల్లు ఆ యింటిముందు పచ్చ గన్నేరు చెట్టు, కొద్దిగా లోపల మందార మొక్కలు, ఇంకా ఏవో పూలమొక్కలు వున్నాయి. చీకటిలో వాటిని పోల్చటం నాకు సాధ్యంకాలేదు. తాతగారు ఇంటి చుట్టు ఉన్న కంచెను దాటుతూ నావైపు రమ్మన్నట్టు చూశారు. నేను అతనిని అనుసరిస్తూ వెనుతిరిగి చూశాను. ఆకాశంలోకి కొద్ది ఎత్తుకు వచ్చిన చంద్రుని వెలుగులో ఆ ఇంటి ముందు వీధికి మధ్యగా వేపచెట్టు, ఆ చెట్టు క్రింద విశ్రాంతి తీసుకుంటున్న నాటుబండి చక్రాలు కనిపించాయి. తాతగారు అరుగెక్కారు. నేను నిత్యమల్లిపూలచెట్టు దగ్గరే నిలబడిపోయాను సంశయిస్తూ.

"రండి బాబూ!" అన్నారు తాతగారు.

నేను ముందుకు అడుగువేయబోతుంటే "గాబులో నీళ్ళున్నాయి తాతగారూ!" అన్న ఆమె మాటలు విని తల ఎత్తి చూశాను. గదిలో హరికెన్ లాంతరుంది. అవి పూర్తిగా వీధిలోనికి కనిపించటం లేదు. వెలుగు మాత్రం కనిపించ సాగింది. ఆ వెలుగులో గాబువైపు చూస్తున్న ఆమె కనిపించింది. తడి కాళ్ళను తుండుగుడ్డతో తుడుచుకుని ఇంట్లోకి నడిచాను. రెండో గదిలో అరిటాకులో ఆహారపదార్థాలన్నీ వడ్డింపబడి వున్నాయి. అరిటాకు ముందు పీట, అక్కడికి సమీపంలో ముక్కాలిపీట, దానిమీద లాంతరు ఉన్నాయి. "కూర్చోమనండి తాతగారూ!" అందామె మెల్లగా.

"కూర్చోండి బాబూ !" అన్నారు




తాతగారు. నేను పీటమీద కూర్చు న్నాను. చాలా సంవత్సరాలుగా 'టేబిల్ మీల్'కి అలవాటుపడటంచేత పీటమీద కూర్చోవలసిరావటం నాకసౌకర్యంగానే వుంది. ఆమె నెయ్యి అన్నంలోకి వేసి "కూర్చోమనండి తాతగారూ!" అంది. నేను కూర్చొని ఉండటం ఆమెకు కనిపించటంలేదా ? — తల ఎత్తి చూశాను. ఆమె వంటింటి గుమ్మం దగర గుమ్మం అవతల నిల్చుని ఉంది. దీపం వెలుగు ఆమె ఎడమచెంపమీద పడుతోంది. ముఖం నాకు స్పష్టంగా కనిపించటంలేదు. కాని విశాలమైన కళ్ళు నా ముందున్న ఒరిటాకుమీదే ఉన్నాయి. విశాలమైన నుదుటిమీద రెండు కను బొమల మధ్య ఎఱ్ఱని కుంకుమ మెరు స్తోంది. ఆమె చేతిలో నేతిగిన్నె కాబోలు ఉంది. "కూర్చోండి బాబూ!" అన్నారు తాతగారు.

అప్పుడర్థమైంది నాకు. గ్లాసులోనుండి పురిసెడు నీటిని కుడిచేతిలోనికి పోసు కుని ఔపాసన పట్టాను. ఈ అలవాటు మరచిపోయి చాలా ఏండ్లయింది. కాని నటించాను. నేను సరిగా వర్తించినదీ లేనిదీ తెలుసుకోవటంకోసం అతనివైపు చూశాను. నావైపు జాలిగా చూచి "చేతిమీద నెయ్యి వెయ్యమ్మా!" అన్నారు తాతగారు. ఆమె నేతిని నా చేతిలో గుమ్మరించింది.

"కాలం మారుతుంది బాబూ! అందు చేత అలవాట్లు కూడా మారుతున్నాయి. కాని అనాదిగా ఉన్నట్టిదీ, సనాతనమైనదీ మన సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలు వ్యవహారాలు రాను రాను

రూపుమాసిపోవటం బాధాకరం. మీ వంటి ఆధునికుల మధ్య అవి రూపుమాసి పోయినంత మాత్రాన అవి లేవని, సమసిపోయినవనీ కాదు. ఉండవలసిన చోట అవి తప్పక, చక్కగా పాలింప బడుతూనే ఉన్నాయి. ఉంటాయి. మీ వంటివారి..."

"ఆయన్ని భోజనం చేయనీయండి తాతగారూ!" అంటూ అతనిని వారించింది ఆమె. కృతజ్ఞత చూపటంకోసం తల ఎత్తి ఆమెవైపు చూశాను. నన్నే చూస్తున్న ఆ కళ్లు నా చూపులకు చిక్కాయి. నేను చూపులను నిగ్రహించుకోలేకపోయాను. నాలో రక్తం చల్లబడింది. నాలుగైదు క్షణాలు ఆమెనే అట్టే చూచి వుంటాను. ఆమె తల దించుకుని వంటింటిలోకి వెళ్ళిపోయింది.

"ఏమిటి బాబూ, ఆలోచిస్తున్నారు?" అడిగారు తాతగారు. నేను తుళుక్కి పడ్డాను

"లేదు...లేదు ... మీరన్న మాట లేవో గుర్తుకొస్తే ... అంతే...మరేం లేదు..." తలవంచుకున్నాను.

"ఆహా! ... సర్లెండి ... ముందు భోజనం చేస్తుండి...కొబ్బరిపచ్చడి కొద్ది వేసుకుంటారా? ... వంకాయి, అల్లంవేసిన కూర...మా మనుమరాలు బాగా చేస్తుంది...అదీ కలుపుకోండి... పెసరపప్పులోకి కొద్ది నిమ్మకాయ బద్ద పిండుకోండి. బాగుంటుంది...అలాగ... వంకాయికూర కలపండి...అమ్మాయీ! చేతిమీద వెయ్యమ్మా!" కేక పెట్టారు తాతగారు.

ఆమె నడిచి వచ్చిన సవ్వడి అయింది. ఆమె పాదాలు, పాదాలపై జీరాడే చీర కుచ్చిళ్ళు కనిపిస్తున్నాయి. ఇంకా...ఇంకా...తల ఎత్తి ఆమె ముఖంవైపు చూడాలని ఉన్నా ఆ సాహసం చేయలేకపోయాను. తాతగారు సూచించినట్టుగానే నే భోజనం చేస్తున్నాను. ఆయన ఆజ్ఞాపించినట్లుగానే ఆమె వడ్డించి వచ్చినంత త్వరగా వంటింటిలోకి వెళ్ళిపోతోంది. చిక్కటి మజ్జిగలోకి ఉప్పును తెచ్చి ఉప్పును దీపానికి చూపించి అన్నంలోకి వేసి వెళ్ళిపోయిందామె.

"ఉప్పును దీపాని కెందుకు చూపటం ?"

"ఆయుషు పెరగాలని. అదో నమ్మకం" అన్నారాయన ఏదో నమ్మకాన్ని కంఠంలో స్ఫురింపజేస్తూ. నేను తలదించుకుని భోజనం ముగించాను. తుండుగుడ్డతో చేతులు తుడుచుకుంటూ ఉంటే, "నా మాటలతో మీ మనసు చెదరిపోయిందేమో మనసుపడి భోజనం చేశారా బాబూ!" అడిగారు తాతగారు. వంటింటిలోకి వెళ్తే, ఆమె వెనుతిరిగి ద్వారానికి ఆనుకుని నిలబడిపోయింది. "అలా అనుకోకండి. నేను చాలా ప్రీతి తోనే భోజనం చేశాను. ఒక్క మాటలో చెప్పాలంటే, 'జన్మానికి శివరాత్రి'

అంటారే అదే ఈ రోజు నాకు. అయితే ఈ ఒక్క అవకాశం దేవుడు నాకు ... ఎందుకు ...” నా గొంతు బొంగురుపోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి. తల తిప్పుకుని “ఈ రోజు నే మరువలేని రోజు. మీకు నా కృతజ్ఞతలు ఎలా చెప్పాలో నాకు తెలియదు,” అంటూ ఆమెవేపు తిరిగాను. ఆమె తల ఎత్తలేదు. కనురెప్పలు బరువుగా వాలి ఉన్నాయి.

“ఉదయానికి వీర్రాజు తిరిగి రాక పోయినా నే వెళ్ళిపోతాను.” తాతగారితో అంటున్నట్టు ఆమెవైపు తిరిగి అన్నాను. ఆమె ఒక్కసారి తలఎత్తి తల దించుకుంది.

“వెళ్ళొస్తామా తాతగారూ!” అన్నాను. ఆమెదగ్గర సెలవుతీసుకోవాలని ఉన్నా నోరు పెగలలేదు. తాతగారు ముందుకు కదలి ఉద్యమిస్తూ “వస్తానమ్మాయి” అన్నారు. ఆమె కొద్దిగా తలఎత్తి మంచిదన్నట్టు తలతిప్పి తల దించుకుంది. ముందుకు కదలబోయి ఆమెవైపు చూశాను. ఆమె వంటింటిలోకి కదలి పోయింది. తాతగారు ముందు నడుస్తూంటే కంచెదాటుతూ మరల వెనక్కు తిరిగి చూశాను. వీధి గుమ్మంలో నిలబడి ఆమె మావైపే చూస్తోంది. ఆమె చేతిలో హరికెన్ లాంతరు ఉంది. దాని వెలుగు ఆమె కంఠంమీద, కంఠం దిగువ భాగాన పడుతోంది. ముఖంమీద దీపపు కాంతి పడకపోయినా, వెలుగు పడుతోంది. ఆమె కళ్ళలో వెలుగుంది. నేను వెనుతిరగటం చూచి ఆమె కనులు దించుకుంది. నేను తాతగారిని అనుసరించాను.

మేము వెన్నెలలో ఇల్లు చేరాము. నాలో అడగటానికి ఎన్నో ప్రశ్నలు. కాని అడగటానికి అవకాశం దొరకలేదు. నన్ను విశ్రాంతి తీసుకోమని తాతగారు దీపం పట్టుకుని ఆలయంలోకి వెళ్ళిపోయారు. నేను బట్టలు మార్చుకుని ఆలయప్రాంగణంలో కొద్దిసేపు తిరిగి మరి కొద్దిసేపు పొన్నచెట్టు క్రింద కూర్చుని మనసులో అలజడి రేగుతూంటే మరి కూర్చోలేక తిరిగి వచ్చాను. నేను తిరిగివచ్చేసరికి తాతగారు ఇంటి అరుగు మీద చదర పరచుకొని, భగవన్నామ స్మరణ చేసుకొంటున్నారు. నా రాకను గమనించి నాకు పాలగ్లాసు నందించి “తీసుకోండి బాబూ! నేను పాలు తీసుకోవటం అయింది. ఈ ఇంట్లో మంచాలు లేవు. ఈ అరుగుమీద నేను పడుకుంటాను. ఆ అరుగుమీద మీరు పడుకోండి” అన్నారు.

నేను బెడ్డింగ్‌ను పరచుకుని మౌనంగా మేను వాల్చాను. అయిదారు నిముషాలకు గాని ఆతనితో మాటాడటానికి నాకు అవకాశం రాలేదు. ఆయన ఈత చాపను పరచుకొని, దీపం తగ్గించి మేను వాల్చి —

"బాబూ! నిద్రపోతున్నారా ?" అని అడిగారు, నేను మెలకువగా ఉన్నట్టు గ్రహించి.

"లేదు" అన్నాను.

"నిద్రవచ్చేటట్టు వుందా?" అడిగారు.

"అంత వేగంగా వచ్చేటట్టులేదు" అన్నాను వెన్నెల్లో పొన్నచెట్టునే చూస్తూ.

"అయితే నే నొక కథ చెప్పనా ?" అన్నారు.

"చెప్పండి" అన్నాను కొద్దిగా అతని వైపు తిరిగి.

"ఈ కార్తీకమాసం ఎంతో ఉత్కృష్ట మైన మాసం. ఎందుచేతనంటే శివాల యాలలో ఆ ఆకాశదీపాలు చూడండి" అంటూంటే "తాతగారూ!" అని అడ్డు తగిలాను.

"ఏం బాబూ! వైష్ణవుడనై యుండి శివుడి గురించి మాటాడుతున్నాననా ? శివ, వైష్ణవ భేదం ఏముంది ? అదిగో! ఆ పొన్నచెట్టును చూడండి. అది వైష్ణవ ఆలయ సమీపాన ఉండదగినది కాదు. ఎందుకుండకూడదనే, నేను అక్కడ నాటించాను."

"అదికాదు తాతగారూ! పురాణాలు నా కంతగా తెలియవు. అయినా తెలుసు కోవాలనే తహతహ నాలో లేదు. మీరు కథలు చెపుతానంటే పురాణాలు చెపుతా రనుకోలేదు..." అని కొద్దిసేపాగి, "ఆమె గురించి చెప్తారనుకున్నాను" అన్నాను.

"ఎందుకలా అనుకున్నారు ?"

"ఎందుకో చెప్పలేను. ఇందాక 'ఒక నిర్భాగ్యురాలు' అన్నారే, ఆమేనా ఈమె? చెప్పండి. అవునా ?" అన్నాను స్వరం కొద్దిగా హెచ్చించి.

"అవును" అన్నారు నెమ్మదిగా.

"ఆమె యిక్కడ ఎందుకున్నట్టు? ఈమెకు ఎవరూ లేరా? తల్లీ తండ్రీ... భర్త పిల్లలు..." ఆగాను. తాతగారు ప్రక్కకు తిరిగి "ఏం చెప్పను ? ఎలా చెప్పను ? ఈమెకు తల్లీ తండ్రీ ఉండే వారు. కాని యిప్పుడు లేరు. పీటల దమీ ఆగిపోయింది పెళ్లి. మరి వివాహానికి ఈమె యిష్టపడలేదు. అందుచేత భర్త లేడు. తమ్ముళ్ళు, చెల్లెళ్లూ పెళ్ళిళ్ళు చేసుకుని వెళ్ళిపోయారు. తల్లీ, తండ్రీ పోగానే గాలిలో దీపంలా ఉన్న ఈమెను విడిచిపెట్ట బుద్ధికాలేదు. యవ్వనం ఉడిగి పోక, వయసు వికసించే వయసులో ఆమె యోగినిగా జీవించటం నా కిష్టం లేకపోయింది. నచ్చచెప్పి నాతో తీసుకు వచ్చాను."

"అంటే...యింతకుముందే ఈమె మీకు తెలుసా ?" అడిగాను.

"తెలుసు. ఈమె తండ్రి ఈ ఊళ్ళోనే పుట్టి ఈ ఊళ్ళోనే పెరిగి ఉద్యోగరీత్యా పై ప్రదేశాలకు వెళ్ళిపోయాడు. వాడూ, నేనూ ప్రాణస్నేహితులం. వాడింటిలో ఏ శుభకార్యం జరిగినా, కష్టం కలిగినా వెళ్ళాను ఒక్క ఆగిపోయిన ఈమె

పెళ్ళికి తప్ప. నేనే వెళ్ళి ఉంటే అ పెళ్ళి ఆగేదికాదు. పెళ్ళిపీటలమీద పేచీకి సమాధానం చెప్పేవాడిని. కత్తుర్తి పడ్డ కట్నాన్ని ముఖాన్న కొట్టేవాడిని. అప్పటికి మా అమ్మ బ్రతికి ఉంది. ఆమె నగలన్నా పెళ్ళికొడుకు ముఖాన కొట్టేవాడిని. కాని నా కా అవకాశం రాలేదు. ఎన్ని విధాల చెప్పినా పెళ్ళికి మాత్రం ఒప్పుకోవటంలేదు. ఇప్పటి కిప్పుడే పది సంవత్సరాలయిపోయింది ఈమె ఈ ఊరొచ్చి. తండ్రిమీద గౌరవంచేతనో, నామీద భక్తిచేతనో, ఆమెమీద అభిమానంచేతనో ఊరు ఈమెకు అపకారం తలపెట్టటంలేదు. మరి నా తరువాత ? అదే నా బాధ! నేను నమ్మిన ఆమె సేవించిన శ్రీరాముడు ఆమెకు అన్యాయం తలపెట్టడు. అదే నా ధైర్యం. ఈమె వయస్సు ముప్పయి దాటింది. నిజమే కాని ఈ కాలమానం ప్రకారం వివాహానికి అనర్హమైన వయసు కాదు. పెళ్ళి గురించి నే ప్రస్తావన తెస్తే, 'నా పెళ్ళి అయిపోయింది తాతగారూ! మళ్ళీ నాకు పెళ్ళా ?' అంటుంది. వివాహ వేదికమీద ఆమెకు జరిగిన పరాభవాన్ని ఆమె మరచిపోలేకపోతున్నది. వివాహమనేది ఎంత పవిత్రమైన కార్యమో ఆమె బాగా గ్రహించింది..."

"ఈమె ఇంత కఠోర నిర్ణయాన్ని తీసుకోకపోవలసింది. వివాహానికి అంగీకరించి ఉంటే బాగుండేది. మీరు చెపుతున్నది వింటూంటే బాధగా ఉంది" అన్నాను.

"అంతే బాబూ! ఆలోచిస్తేనే బాధ అంతా! ఆలోచించకండి. హాయిగా నిద్రపోండి. ఉదయాన్నే ప్రయాణం కదా!" అంటూ గుండెమీదికి రెండు చేతులను తెచ్చుకుని "హరే రామ్" అంటూ నిద్రకుపక్రమించారు తాతగారు.

చంద్రుడు పొన్నచెట్టును దాటి చాలా ఎత్తుకి వచ్చారు. వెన్నెల ఇళ్ళమీద తెల్లని మంచులా మెరుస్తూంటే, చలి గాలితో పొన్నపూవాసనలు సన్నగా కదలి రాసాగాయి. ఆ సమీపంలో ఉండే చెట్టుమీద పిట్ట లెందుకో అరచి తరువాత మిన్నకుండిపోయాయి.

తాతగారు నిద్రపోతున్నారు. నాకు మాత్రం నిదురరావటంలేదు. కాదు. నేనే నిద్రను ఆహ్వానించలేకపోతున్నాను. బహుశా నేను సుఖంగానిద్రించే రాత్రులిక ఉండవేమో.ఎంత సేపని అలా గడపను? మరపురాని గతాన్ని సింహావలోకనం చేస్తూ ఎంత సేపలా ఉండను? గడిపిన కాలాన్ని ముందుకెలా తేగలను? పద హారు సంవత్సరాల కాలాన్నిదాటి వెనుకకు పరుగెత్తి పోవాలి! ఎలా? ఇన్నినాళ్ళుగా నేననుభవిస్తున్న అసంతృప్తికి కారణాన్ని తెలుసుకుని ఇంకా ముందుకి ఎలా పోగలను? ముందుకి పోక చేయగలిగినదేముంది?నాకు హోదా

అయిన ఉద్యోగముంది, ఇల్లుంది. వాక లుంది. బ్యాంకు ఎకౌంటుంది. సంఘంలో పలుకుబడి ఉంది. అయినా వెలితి.

తాతగారి వైపు చూశాను. ఆయన నిద్రపోతున్నారు. నెమ్మదిగా ప్రక్క మీదినుండి లేచాను. అడుగులు చప్పుడు వినపడనీయక నెమ్మదిగా కదిలాను. అలా ఒం ముఖద్వారందగ్గర కొచ్చి ఆగాను. వీధిఅంతా నిర్మానుష్యంగా ఉంది. రేడియమ్ డయల్ వాచీ చూశాను మూడుగంటలు దాటింది. ముందుకు అడుగువేశాను. 'ఎక్కడికి?' నాలో ఎవరో అడిగారు. 'అక్కడికే' అన్నాను. ముఖద్వారం దాటాను. అటు యిటు చూశాను. ఎవరూలేరు. గబగబా అడుగులువేసుకుంటూ ఆ ఇంటికి సమీపంగా వెళ్ళాను. అంతలో ఎవరో నా భుజం పట్టుకుని ఆపినట్టయింది. ముందుకు అడుగుపడలేదు నిత్యమల్లి చెట్టు దగ్గర నిలబడిపోయాను. వెనుకకు పొమ్మని ఎవరో అంటున్నట్టు అనిపిస్తూన్నా వెనుకకు మరలిపోలేకపోయాను ముందుకి పోలేకపోయాను. తలఎత్తి చూశాను. చంద్రుడు నడినెత్తిమీద నన్నే వింతగా చూస్తున్నాడు. చుట్టూ తారకలు నన్నే చూడసాగాయి. గాలి నన్ను వాసనచూసి ఒకప్రక్కకు పరుగెత్తిపోయింది. గుండె బరువెక్కింది. కాని కంటివెంట నీరురాలేదు నోటమాట పెగిలిరాలేదు.

'ముందుకు పోనా? వెనుకకు పోనా? నాకెవరు చెప్తారు? నాకెవరు చెప్తారు? నాకెవరు ......" గట్టిగా ఎలుగెత్తి అరవాలనుకున్నాను. చేతకాలేదు.

'ఈ రాత్రి మరల తిరిగిరాదు. వెళ్ళు, వెళ్ళి ఆమెకు కనిపించు.'

'వద్దు, వెళ్ళకు, ఏమీ మిగలని నీవు ఆమెకు ఏమీ యివ్వలేవు. నా మాట విను.'

ఎవరో వెనుకకు లాగుతున్నట్టున్నా, వారి పట్టును విడిపించుకుని ముందుకురికాను. అరుగెక్కి తలుపుతట్టబోయి దగ్గరగా వేసిఉన్న తలుపులు తోసుకుని ఇంటిలోపలికి అడుగుపెట్టాను.

చిన్న బల్లమీద కుడిచేతిపై తల నుంచుకుని ఒకప్రక్కగా తిరిగి నేల మీద కూర్చుని నిద్రపోతున్నదామె. ఆమెకు సమీపంలో హరికెన్‌లాంతరు గ్రూ గన్ను పెట్టి నిద్రపోతున్నది. ఇంటిలోపలికి నడిచి దీపం పెద్దదిచేశాను. ఆ వెలుగులో చూశాను స్పష్టంగా. ఏ మార్పూ లేని 'యామిని.' పసుపుతాడులేని బోడిమెడ. అప్పటికి యిప్పటికి అలాగే ఉంది. 'ఈ మెడలో నన్నుకాదని నీవు ఎవరిచేత మంగళసూత్రం కట్టించుకుంటావో చూస్తాను?' అని ఏనాడే దేనినో అర్థం చేసిఉన్నదానిలా భావయుక్తంగా నవ్వే ఆ నవ్వు నాకు గుర్తుకొచ్చింది. గుండెలో రక్తం ఒక్కసారి చల్లబడింది. నెమ్మదిగా రెండడుగులువేసి పరీక్షగా చూశాను. తడి ఆరిఉరని కేశాలు కొన్ని

వక్షంమీద, మరికొన్ని భుజంమీద వ్యాపించి ఉన్నాయి. కనురెప్పలు తడిగా ఉన్నాయి. బుగ్గలమీద కన్నీరు ప్రవహించిన జాడలు స్పష్టంగా దీపపువెలుగులో మెరిశాయి.'యామిని'ని నిద్రలేపి క్షమార్పణ చెప్పుకోవాలి. ఆమె పట్టుదలను సడలింపజేయాలి. ఆమె సుఖంకోసం ఏమైనా చెయ్యాలి— మోకాళ్ళపై కూర్చుని చేతిలోని రుమాలు ఆమె కనులకు దగ్గరగా, కన్నీరు తుడిచే ప్రయత్నంలో 'ఇంతకాలమై, నాకొరకు వేచిఉన్న నిన్ను చూడక మరలిపోవాలనుకున్న నన్ను క్షమించు యామినీ' అని గొణుగుకుని, చేతిని కొద్దిగ ముందుకు పోనిచ్చి "యామినీ! యామినీ!!" అని పిలిచాను. నా గొంతు నుండి మాటలు అంత స్పష్టంగా పెగల్చి వుండవు. మరోసారి పిలువబోయాను. వీధిగుమ్మం దగ్గర అలికిడి అయింది. వెనుతిరిగి చూశాను. వీధితలుపులు తెరచుకున్నాయి. నేను లేచి నిలబడ్డాను.

లోపలికి అడుగుపెట్టిన తాతగారు త్వరగా నావైపు వచ్చారు. నేను ఆయనకు అభిముఖంగా వెళ్ళాను. "మీతో మాటాడాలి. త్వరగారండి" అంటూ నాచేతిని పట్టుకుని ద్వారంవైపు లాక్కెళ్ళారు.నేను ఆయన వెనుక వెళ్తూ వెనుతిరిగి చూడాలనుకున్నాను. కాని తాతగారు నన్ను గుమ్మందాటిస్తూ తలుపులు మూయటం, తలుపులు ధ్వని చేయటం జరిగిపోయింది.

తాతగారు చెయ్యిపట్టుకుని లాగారు. వేపచెట్టు దగ్గరకి రాగానే నాచేతిని వదలి 'నా వెనుకరండి' అన్నారు. మేము కోవెల ముఖద్వారం దాటి లోపలి కెళ్లాం. ఆయన ఆగి వెనుతిరిగి, నన్ను చూసి, "మీలాంటి పెద్దలకిది తగునా?" అన్నారు. ఆయన ఉద్దేశ్యం నా కర్థమైంది. "తాతగారూ! నన్ను తప్పు అర్థంచేసికోకండి. నేను ఏ దుశ్చింతతో అక్కడికి వెళ్ళలేదు" అన్నాను. అతను నావైపు తీక్షణంగా చూసి, "అర్ధరాత్రి ఒక పరాయిపురుషుడు ఒక యవ్వన వతి దగ్గరికి వెళ్ళాడంటే ......" "కాదు తాతగారూ! నేనందుకు వెళ్ళ లేదు" అన్నాను. "మరెందుకు?" నిలవదీశారు. "నన్ను మీరు అపహ్యాంచు కోనంటే,ద్వేషించనంటే నిజం చెప్తాను. మాటయివ్వండి." "మాట యివ్వటం ఆ తరువాత. ముందు మీమీద సదభి ప్రాయం ఏర్పడాలంటే మీరు నిజం చెప్పాలి," అన్నారు. మేము నెమ్మదిగా పొన్నచెట్టు క్రిందకి నడిచాము. తల ఎత్తి అతని ముఖంలోకి చూచి, "మీరు నన్ను క్షమించలేరు. అయినా నిజంచెప్తున్నాను. మీ మనుమరాలు 'యామిని,' ఇంత కఠోర దీక్షను సాగించటానికి కారకుడను నేనే తాతగారూ! ఇరవై ఏళ్ళ వయసు కూడాదాటని ఆ వయసులో తల్లిదండ్రుల మాట నెదిరించలేక, మనసార యిష్ట పడిన 'యామిని'ని వివాహ వేదికమీద

కన్నీళ్ళతో వదలి వచ్చిన ఆ...ఆ... నేనే తాతగారూ.మీ రే పేరు పెట్టినానాకు సరిపోతుంది. పెళ్ళిచెడిపోయిన వారం రోజుల లోపుగానే వాళ్ళంతా ఎక్కడికో తరలివెళ్ళిపోవటంచేత నేను 'యామిని'ని కలియలేకపోయాను. 'యామిని'ని దక్కించుకోలేకపోయాను. జీవితంతో రాజీపడ్డాను. కాని...కాని 'యామిని' తన్ను సాధించుకుంటూ, నన్ను సాధిస్తుందని నేననుకోలేదు. ఆమెకోసం 'నేను ఏంచేయగలనో తెలియదు. ఏం చేయాలో తెలియదు. 'యామిని'ని ఒక్కసారి కలిసి క్షమించమని వేడుకుంటాను. అంతమాత్రంచేత నా తప్పు ఒప్పు అవుతుందని కాదు. మనసున్న మనిషి చేయవలసినపని అది. నన్ను వెళ్ళనివ్వండి. ఒక్కసారి వెళ్ళనివ్వండి." నా గొంతు వణికింది. అతని రెండుచేతులు పట్టుకున్నాను. తాతగారి కనులు ఎఱ్ఱబారినై. ఆవేశాన్ని అదుపులో పెట్టుకునే ప్రయత్నంచేస్తూ "మీరు... మీరు అక్కడికి వెళ్ళవద్దు...ఈనాటి ఆమె పరిస్థితికి కారణం మీరు. అయినా మీరు కనిపించగానే సులభంగా క్షమిస్తుంది పిచ్చిపిల్ల. అది నాకు యిష్టం లేదు. ఇన్ని సంవత్సరాలయినా మిమ్మల్ని మరచిపోని నా తల్లి, రోజుకొకసారైనా మిమ్మల్ని తలవక ఉండని నా పిచ్చితల్లి మిమ్మల్ని క్షమించకూడదు. మీ మంచితనాన్ని పొగడి, మీ వంచనకు ఆహుతి కాకూడదు. మీరిక్కడుండకండి...వెళ్ళిపొండి ... మీరంతా డబ్బు తినే మనషులు..." అంటూ తల పట్టుకున్నారు తాతగారు. నేను గొంతు పెగుల్చుకుని, "నేను యామినిని వంచించలేదు తాతగారూ! నన్ను మీవంటి పెద్దలంతా కలిసి, సాంప్రదాయాల పేరిట, లాంఛనాల పేరిట, వంచించారు తాతగారూ! నేను పెళ్లిచేసికుని సుఖపడుతున్నాననేగా మీ బాధ. ఈ ఫోటోను గుండెకు దగ్గరగా ఇన్ని సంవత్సరాలు దాచుకుని ఎంతగా సుఖపడుతున్నానో ఆలోచించండి.'యామిని' నన్ను క్షమించకూడదనేగా మీ ఉద్దేశ్యం అలాగే కానివ్వండి. నన్నెవరూ క్షమించవద్దు. తప్పంతా నాదే. మిమ్మల్నందర్నీ నేనే వంచించాను. తప్పు నాది కాకపోతే రాధ పెళ్లి నన్ను యింతగా బాధించేది కాదు..." నేనాగాను. "తాతగారూ! నే వెళ్లిపోతాను లెండి. నన్ను మీరు క్షమించకండి."

తాతగారు కళ్ళు తుడుచుకున్నారు. తాతగారి రెండుచేతులు పట్టుకుని "నాకోసం కాకపోయినా మీ పిచ్చితల్లికోసం ఒక సహాయం చేసిపెట్టగలరా?" అన్నాను. "ఏమిటి?" అని అడిగిన అతని మాటలకు సమాధానమీయక అతని చేతిని పట్టుకుని ఇంటివైపు లాక్కెళ్ళాను. నా బ్రీఫ్‌కేస్ తెరచాను. రాధ పెళ్లికి ఎడ్వాన్సుగా యిద్దామని

తీసికెళ్ళి, ఇవ్వక తిరిగితెచ్చిన పదివేల రూపాయల కట్టలు నా చేతికందాయి. వాటి నందుకున్నాను. తాతగారి చేతుల్లో ఉంచుతూ "ఇవి...ఇవి...యామిని కోసం...కాదు...కాదు...ఇవి సరిపోవు నాకు తెలుసు...ఎంతకావాలన్నా అంతా యిస్తాను...యామిని సుఖపడాలి..." డైరీలోంచి చెక్కు పుస్తకం అందుకుని పెన్ను తెరిచి సంతకం పెట్టబోతూంటే తాతగారు నా చేతిని పట్టుకుని, "ఏమి టిది తాతా? ఎందుకివన్నీ?" అన్నారు. నేను తలఎత్తగానే "ఎందుకిలాపిచ్చిపడు తున్నారు?" అన్నారు. "అవును పిచ్చే యామిని కేమిస్తే సుఖపడుతుందో తెలి యదు. నే నివ్వగలిగింది ఇదే. యామిని నన్ను తిట్టనీండి, అసహ్యించుకోనీండి, ద్వేషించనీండి, తన్ను నేను మరచి పోయానని నమ్మించండి ... ఆమెకో సీద ... ఒప్పించండి... పెళ్ళి చేయిం చండి..." కళ్ళలో నీళ్ళుతిరిగాయి. తాతగారు మాటాడలేదు. ఆయన కళ్ళ నిండా నీరుంది. "తాతగారూ!" అన్నాను.

"ఏద్వటంలేదు బాబూ! కాని నేను వేదాంతిని కాను. ఎవరిని ఏమనను?" అన్నారు జాలిగా. నేను ఆయన చేతిలో నుండి జారిపోతున్న నోట్లకట్టలను అందుకుని, నా బ్రీఫ్‌కేసుని ఖాళీచేసి, అందులో డబ్బుసర్ది. "పదిలపరచండి తాతగారూ?" అంటూ ఆయన చేతి కందించాను. నేను బెడ్‌హోల్డాల్ సర్దు కున్నాను. తాతగారు ఇంటిలోకి వెళ్ళి వచ్చారు. "రేపుదయం వీర్రాజు వస్తే నే వెళ్ళిపోయానని చెప్పండి. అతనిని రెండురోజులు ఆగి రమ్మని చెప్పండి" అని చెప్పి ముందుకు అడుగువేయ బోయి, పర్సుతెరచి అందుబాటులో ఉన్న నోట్లను అతని చేతుల్లో బలవం తంగా ఉంచుతూ, "ఉంచండి తాత గారూ! మీ రుణం తీర్చుకోవటం కష్టం. మీరు చెప్పినట్టుగానే రాధను ఆమె కోరుకున్న అతనికే యిచ్చి పెళ్ళి చేస్తాను. యామినికి మాత్రం ఏ లోటూ రానీయకండి" అని చెప్పి సామాను నందుకున్నాను. సామానుంచి నే తిరిగి వచ్చేవరకు తాతగారలా నిలబడే ఉన్నారు. నేను దేవాలయంలోకి కది లాను. నా వెనుకనే తాతగారు వచ్చారు. తలుపుల వెనక శ్రీరాముడున్నాడు. నాకు కనిపించడు. కాని మనసులో చెలరేగే అలజడి కొంతమాత్రమైనా దైవసన్నిధిలో తగ్గుతుందేమో అని ఆశ. నేలమీద చతికిలపడ్డాను సముద్రపు అలలు సముద్రపు ఒడ్డుకు బలంగా తాకు తున్నట్టుగా గుండెలో రక్తం ఎగతన్ను తోంది. తాతగారు నా భుజంమీద చెయ్యివేసి "బాబూ! ఎందుకు దిగులు! తప్పు. మనం ఎవ్వరంకాము. అంతే. వెళ్లి అమ్మాయి పెళ్లి జరిపించండి బాబూ. యామినికేలోటూ రాదు సరేనా?

అంటూ లాలనగా మాటాడారు. ఏదో కొంత ఉపశాంతి. నెమ్మదిగా లేచాను. మెట్లుదిగుతూ ఆగి తాతగారివంక తిరిగి "వెళ్తాను తాతగారూ," అన్నాను ఆయన చేతిని తాకి. ఆయన పలుకలేదు. ఎవరినో చూస్తున్నట్టున్నాయి అతని చూపులు. స్వరంపెంచి "వెళ్లిపోతున్నాను తాతగారూ! దయఉంచండి" అన్నాను. ఆయన సర్దుకుని, చూపులు మరల్చుకొని నన్నుచూచి "తప్పు బాబూ! 'అలా అనకూడదు. వెళ్లివస్తాననండి" అన్నారు. తల విదుల్చుకున్నాను "రాను తాతగారూ! రాను. ఈ వెళ్లిపోవటమే వెళ్లిపోవటం. సెలవియ్యండి."

తాతగారు మెట్లుదిగారు. "పోనీ బాబూ?...ఒక్కసారి..." నాకు తెలుసు తాతగారేమంటారో. యామిని నన్నింకా ఆరాధించటం నేను సహించలేను. యామిని నన్నుద్వేషించాలి. అసహ్యించుకోవాలి.

కారువైపు పరుగెత్తాను ఒకసారి ఆ యింటివైపుచూచి కారు స్టార్టుచేశాను. కారు ముందుకు కదంటంలేనంతగా పోతోంది. యామినిని కలిసి మాటాడలేని నా మనసుమాత్రం వేగంగా వెనుకకు పరుగెడుతోంది. చెఱువు మొగలులోకి వచ్చింది కారు. దాని చెట్టుక్రింద బొజ్జ వినాయకుడు నన్నే చిత్రంగా చూస్తూ, నావైపు పరిహాసంగా చూస్తూ నవ్వుతున్నాడు. గాలి విసురుగా కదిలింది. పడమటకు వంగిన వెన్నెల చెట్లాకుల లోంచి వినాయకుడిమీద కదిలింది. అక్కడే కొద్దిసేపు కూర్చుని ఏదో చెప్పుకోవాలనిపించింది.

మనిషి మనిషిని ద్వేషిస్తాడు. ప్రేమిస్తాడు, సృష్టించిన శక్తికి తప్ప మరెవరికీ అందుకు సరియైన కారణం తెలియదు. అందరూ వేదాంతులు కారు. కాలేరు. కాని తమ చుట్టూ ఉన్నదంతా 'అస్థిర మని,' 'అశాశ్వతం' అని నమ్ముతారు. అయినా అశాశ్వతమైన దానిని, ప్రేమించకుండా ఉండలేరు వాటికోసం వెర్రిపడకుండా ఉండలేరు.

నేను బ్రతికిఉన్నంతకాలం యామిని మీద భ్రాంతి ఉండనే ఉంటుంది. యామినికూడా అంతే.

నేనుగాని, యామినిగాని శాశ్వతం కాము. అశాశ్వతమైన ఈ జీవితం శాశ్వతమైనదానిని దేనినో కోరుతోంది. నాకు తెలుసు. మనం పొందని దేదుందో అదే శాశ్వతం. మనం పొందినవన్నీ అశాశ్వతాలు. అశాశ్వతంనుండి శాశ్వతాన్ని పొందటంకోసమే ఆర్యులు తపసు చేసేవారేమో.

కారు నాపాను. దిగబోతున్న తరుణంలో నాచేయితగిలి క్రిందకుజారి పోయింది. ఆత్రుతగా చూశాను. అది నా బ్రీఫ్‌కేస్ తాతగారికి, యామిని కోసం డబ్బుతోఉంచిన బ్రీఫ్‌కేస్ అయోమయంగా పెట్టెనుచూస్తూ, పెట్టెను

తెరచిచూశాను. నేనిచ్చిన నోట్లకట్టలు అలాగే ఉన్నాయి. వాటిమీద నేను తాతగారికోసం అసంపూర్ణంగా వ్రాసిన బ్యాంకుచెక్కు. దాని ప్రక్కనే ఉంది; నాచేతిరుమాలు. వెంటనే అర్థమైంది. ఆ కేస్ నా కారులోకి ఎలా వచ్చినదీ. నా చుట్టూ చీకటికమ్మింది. వెన్నెల కాచు పూసుకుంది. యామిని ఇంటిలో మరచిపోయిన రుమాలును తిరిగి అందివ్వటానికి యామినితప్ప మరెవరికుంది అవకాశం? వెంటనే ఊరులోకి పరుగెత్తిపోయి, యామిని ముందు వ్రాలిపోవాలనిపించింది. అటే రెండడుగులు వేశాను.

నే నిలుచున్న చోటునుండి కొద్దిగ ఎదురుగా, ఊరుదరి రేవులో ఒకతెల్లని చీర నీటినుండి బయటికి వచ్చింది. నావైపే తిరిగింది. వక్షంపై కొంత వ్యాపించిన పొడవైన జుట్టు—వెన్నెలను కలుపుకుంటున్న ఆ చీకటిలో నన్నే చూస్తున్న కళ్ళు—నేను గుర్తుపట్టాను. ఆ నిల్చున్న తీరు నాకు తెలుసు. ఆమె యామిని. కొద్దిగ నీటినుండి బయటకు వచ్చి ఒడ్డునచేరి కుంకుమ దిద్దుకుంది. దీపపు ప్రమిదను వెలిగించింది. ఆ ప్రమిదను ఎందులోనో (బహుశా అరటి మట్ట అయిఉంటుంది) ఉంచింది. దానిని రెండుచేతులలోకి తీసికుంది. నీటిలోకి దిగింది. మోకాళ్ళ నీటిని దాటింది. మొల దాటింది నీరు. ఇంకా ముందుకొచ్చి రెండుచేతులను పైకెత్తిపట్టింది. ఆ వెలుగులో యామిని కళ్ళను, ఆ కళ్ళలో వెలుగును చూశాను. ఇంకా ముందుకు వచ్చింది. నీరు నాభిని దాటింది. ఇంకా ముందుకొచ్చింది. నీరు వక్షాన్ని దాటింది. యామిని పొడవైన బాహువులను ముందుకుచాచి నీటికి, సమాంతరంగా ఉంచి వెలుగుతున్న దీపాన్ని నీటిపైనుంచి నెమ్మదిగా ముందుకు త్రోసింది. తాను ఒడ్డునచేరి ఆ కదలే దీపాన్నే (ఇప్పుడర్థమైంది. అది ఓడ) చూస్తూ నిలబడిపోయింది. నేను యామినిని చూశాను. ఆ దీపాన్ని చూశాను. దీపమున్న ఓడను చూశాను. ఆ ఓడ నావైపే ప్రయాణిస్తోంది. యామిని తన చూపులతో దీపాన్ని నావైపే నెట్టుతోంది. ఆ దీపం దేదీప్యమానంగా వెలుగుతోంది. ఆ వెలుగే నా చుట్టూ నిండింది. 'యామినీ' బిగ్గరగా అరవాలనుకున్నాను. మాట గొంతులోనే ఉండిపోయింది. ఊరు మేలుకుని చెలువుచుట్టూ చేరసాగింది, యామిని ఊరిలోనికి కదలిపోయింది. ఓడ మాత్రం నావైపే పయనించసాగింది. దరినున్న గట్టుపైని ఆకాశదీపం నన్నే చూడసాగింది.